కథ

# "కౌన్సిలింగ్"

ఇమంది రామారావు




పేద్ద కొండవీటి చాంతాడంత పేరు మోసిన సుప్రసిద్ధ మానసిక శాస్త్రవేత్త విశ్వపతి ఆఫీసు. దిన, వార, పక్ష పత్రికల్లో పక్షపాతం లేకుండా ప్రకటనలుగుప్పించడం వలన అతడ్నొకసారి చూడాలని పించింది. నాకేం మాయరోగం లేదు..వున్నదల్లా మా ఆవిడకే... ఊరకే ప్రతివిషయాన్నీ అనుమానిస్తుంది. మొగుడిమీద అనుమానం వుండటం ఏభార్యకయినా సహజమే. కానీ తనమీద తనకే అనుమానం. ఆ అనుమానం పెనుభూతంలా మారిపోయింది. ఇంక ఘడియో.... క్షణమో అన్నట్లుంది తన పరిస్థితి. చరస్థిరాస్థుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంది. ఒకవేళ తను గుటుక్కుమంటే వున్న ఇద్దరి పిల్లల్నీ ఏం చేయాలి? తన క్రతువులూ వగైరా కార్యక్రమ వివరాలన్నీ డైరీలో భద్రంగా రాసుంచింది. అయినా తనకేదో తీరని వెలితి. లోలోపల ఏదో బాధ - తను అన్యాయమై పోతున్నానన్న ఫీలింగు - పిల్లలకి అన్యాయం జరిగిపోతుందన్న తీర్మానం - అందుకే ఒకసారి సైకియాట్రిస్ట్‌ని సంప్రదించాలని ఉడుం పట్టు పట్టింది. సంప్రదించడమంటే పళ్లు తీసుకెళ్ళి పళ్లికలించి మాట్లాడ్డం కాదుకదా... పదిహేను వందలు అడ్వాన్సుగా సమర్పించుకోవాలి. ముందుగా ఎపాయింట్‌మెంట్ తీసుకోవాలి. ఆ టైములో కలవాలి. అతగాడి దయాధర్మాల మీద తిరిగి రావడం ఆధారపడి వుంటుంది. లేదా కంచి గరుడ సేవ చేయాల్సిందే. ఇన్ని చిక్కులుండబట్టే నేను య్యస్ అనలేదు. అలా య్యస్ అనలేదు కాబట్టే... మా ఆవిడ నాకు తెలీకుండా అడ్వాన్సు పే చేసి ఎపాయింట్‌మెంట్ తీసుకుంది. నన్ను రెక్కపుచ్చుకు లాక్కెళ్ళింది.

అదేం చిన్నా చితకా ఆఫీసు కాదు. పెద్దదే!. జనం కూడా దండిగా వున్నారు. విశ్వపతి ప్రకటనలు గుప్పించిన దిన,వార,పక్ష పత్రికలూ సినీ వార పత్రికలూ ఎదురుగా వున్న టీపాయ్ మీద వున్నాయి. నేనూ మా ఆవిడ చెరో పత్రిక తీసుకొని సోఫాలో సెటిలయ్యాం.

అపాయింట్‌మెంట్ టైమింగ్స్ ప్రకారం మమ్మల్నే.... సారీ..... మా ఆవిడ్నే మొదట చూడాలి. కౌన్సిలింగ్ చెయ్యాలి. విశ్వపతి సారు సూటుబూటులో ట్రిమ్‌గా ఆఫీసుకొచ్చి తన చాంబర్‌లో కెళ్ళి. తలుపులు మూసుకొని ట్రింగ్... ట్రింగ్‌మని బెల్లు కొట్టాడు. ఆఫీసు కొత్తదైనా బెల్లు పాతదే..... పాతమోత రోతగా అనిపించింది.

"మిమ్మల్నే.... సారు పిలుస్తున్నారు !" అటెండరు పిలిచాడు.

"నువ్వెళ్ళు !" అన్నాను.

"అక్కడే తిక్క రేగుతుంది" కాళికాదేవిలా కళ్ళెర్ర చేసింది. ఇంక చేసేదేముంటుంది ? ఆమెను అనుసరించాను.

"మీరూ...... శాంతి కదూ?" సాధ్యమైనంత వరకూ అందంగా కనిపించడానికి విశ్వపతి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఈవిడగారు తలూపేరు.

నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"మీరు నాకు బాగా తెలుసు!" అన్నాడాయన.

ఇదొక టెక్నిక్కు - మీరు నాకు తెలుసు అనగానే సగం పడిపోతాం.... ఏదో ఇంటిమసీ ఫీలౌతాం.

అడగవలసిన నాలుగు ముక్కలూ మరచిపోతాం.

ఆయన గొంతు సవరించుకొని.... ముందుకు వంగి... చర్మం చిల్లుపోయేలా మరోసారి ముఖం రుద్దుకొని. ఆ మంటని లోలోపలే భరించి....

"అమ్మా.... నన్ను మీ బ్రదరనుకొండి... మీ బిడ్డనుకొండి... మీ తండ్రనుకొండి...."

"అనుకోడానికి ఇవి చాలు.... ఇంకేం అనుకోదులెండి" మనసులో అనుకున్నాను. మా ఆవిడ పెదవుల మీద చాలా కాలం తర్వాత పలచని నవ్వు తెర పరుచుకుంది.

" అమ్మా !.... మీ బాధేవిటో చెప్పండమ్మా..." వందటన్నుల వినయ సంపదని ప్రదర్శించాడు విశ్వపతి.

"ఏం.... చె...ప్ప...మంటారు?" నసిగింది శాంతి.

"ఏదో ఒకటి చెప్పేయి.... ఒకటి కాదు రెండు కాదు... పదిహేను వందలు..." అన్నాను మా ఆవిడకి మాత్రం వినిపించేలా.

"మీరు చెప్పండి! నా మీదకి నెట్టేసింది.

"నేను చెప్పాల్సిందయితే ..... నువ్వెందుకొచ్చినట్లు? బాధ నీది.... బాధ్యత నాది!... ఊ c !..... చెప్పు!" చిన్న హుకూం జారీ చేశాను.

"చచ్చి...పో.....వాలనిపిస్తుందండీ!" సడన్‌గా బాంబు పేల్చింది శాంతి. నాతో బాటూ ఆయనా అదిరిపడ్డాడు.

"ఊ..... ఇంకా...." ఆసక్తిగా ముందుకు వంగాడు విశ్వపతి.

"చచ్చేక ఇంకా చెప్పడానికేముంటుంది నా బొంద... ఈవిడగారు చెప్పిందానికీ.... ఆయనగారు అడిగిందానికీ 'దొందూ దొందే" అనిపించింది".

"ఎందువలన అలా అనిపిస్తుంది?" విశ్వపతే కల్పించుకున్నాడు.

"తెలీదు!"

"ఎప్పట్నించి మీకలా అనిపిస్తోంది?"

"పెళ్ళయినప్పట్నించి!" నేను కల్పించుకున్నాను.

"మీరుండండి.... నాక్కావలసింది శాంతి సమాధానం... చూడమ్మా ఎప్పట్నించి మీకు చావాలనిపిస్తుంది?"

"చాలా కాలం నుంచి!"

" నేను చెప్పానుగా!"

"మీరూరుకోండి!"

"నేను చేయగలిగిందదేగా!"

"గుండె బరువెక్కినట్టుందా?"

"టోటల్‌గా బరువు పెరిగిపోయిందండీ!" వుండలేక అనేశాను.

"సార్.... మీరూ?" నాకేసి అసహనంగా చూశాడు విశ్వపతి.

"అదేవిట్సార్... ఆవిడగారి బరువు బాధ్యతలు చూసేది నేనేగా!" అన్నాను.

"అఫ్‌కోర్స్.... అఫ్‌కోర్స్. మీరు నాతో రండి" అంటూ తనతో బాటు మమ్మల్ని ఓ చీకటి గదిలోకి తీసుకెళ్ళాడు. అసలే చీకట్లో వున్న మమ్మల్ని ఇంకా చీకట్లోకి తీసుకెళ్తున్నాడేవిటీ అనుకున్నాను.

"చూడండి! మీరు పదినిముషాల పాటు బిగ్గరగా ఏడ్చేయండి!"

"వున్న ఫళంగా ఏడ్వమంటే ఎలా?" శాంతి ధర్మసందేహం

"గుండెల్లో వున్న బాధంతా బైటకి ప్రదర్శించేయాలమ్మా... నేను చెప్పినట్లు చెయ్యండి. మనసెంత తేలిక పడుతుందో చూడండి!" మా సమాధానం కోసం ఎదురు చూడకుండా తలుపులు మూసి మరీ వెళ్ళిపోయాడు విశ్వపతి.

"ఇదేవిటండీ.... ఇపుడెవరు పోయారని ఏడవమంటారు?"

"పదిహేనువందలు పోయాయని!"..... గదిలో లైటు లేదు. ఫేను లేదు కనీసం కూర్చోడానికి కుర్చీ కూడా లేదు. మా ఆవిడ పళ్ళూ కళ్ళూ తప్ప ఇంకేం కనపడ్డం లేదు. మా దరిద్రాన్ని తలచుకుంటే నిజంగానే దుఃఖం పొంగుకొస్తుంది.

సడన్‌గా మా ఆవిడ శోకాలు తీయడం మొదలుపెట్టింది.... మూర్తీభవించిన ఆ శోకదేవతని కళ్ళారా చూదామంటే కటిక చీకటి... దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తోంది. నాగుండె గుభేళ్‌మంది.

"ఏవిటే - నిజంగా ఏడుస్తున్నట్టున్నావ్." భయపడుతూ అడిగాను.

"ఏ పురుగో పుట్రో కుట్టిందేమోనండీ... వంట్లోకి ఏదో విషం పాకుతున్నట్లు ఒకటే మంట. నొప్పి.... అమ్మో.... ప్రాణాలు పోతున్నాయి బాబోయ్" లబోదిబోమంటూ మొత్తుకుంటుంది మా ఆవిడ.

"డాక్టర్‌గారూ... డాక్టర్‌గారూ... డాక్టరేంది నా తద్దినం.... విశ్వపతిగారూ! ఇక్కడ సమ్‌థింగ్ హేపెండ్... తలుపులు తీయండి. మా ఆవిడ నిజంగా ఏడుస్తోంది. చచ్చేలా వుంది తలుపులు తియ్యండి!" నేను మొరపెట్టుకున్నాను... కాదు మొత్తుకున్నాను.

" నేను మనస్తత్వ శాస్త్రవేత్తని! ఆమె మానసిక స్థితినాకు తెలుసా! మీకు తెలుసా? ఇంకో అయిదునిముషాల వరకూ నథింగ్ డూయింగ్..." ఖరాఖండిగా చెప్పేశాడు.

"ఏవండీ.... చచ్చిపోతున్నాను.... ఏవంటారాయన?"

"తెలుగులోనే మాట్లాడుతున్నారు... విన్నావుగా!

" కుళ్ళు జోకులెయ్యొద్దు... తలుపులు పగలగొట్టండి!" చీకట్లో ఆవిడగారి ముఖంలో మారే ఎక్స్‌ప్రెషన్స్ గమనించలేని దుస్థితి - నా గ్రహస్థితి బాగుండబట్టి ఏర్పడింది. లేకపోతే గుండాగి చచ్చేవాడ్ని.

మరో అయిదు నిమిషాలు గడిచాయి.

తలుపులు తెరుచుకున్నాయి.

వెలుతుర్లో మా ఆవిడ ముఖం చూసి కంగారు పడిపోయాను.

"శాంతీ..... ఏవయ్యిందిరా !?" నాకూ కళ్ళల్లో నీరు తిరిగాయి.

"ఏ తేలో.... విష కీటకమో కుట్టిందండీ! "పసిబిడ్డలా ఏడుస్తోంది శాంతి.

"ఎలా వుందీ?" విశ్వపతి తాపీగా అడిగాడు.

"ప్రాణాలు పోతున్నట్లుంది!"

"కంప్లైంట్ అదేగా !..... ఈ గదిలోకి రండి!" అంటూ మరో గదిలోకి తీసుకెళ్ళాడు. ఆ గదినిండా కాశ్మీరం అందాలు కనులకింపుగా వున్నాయి. పాత సినిమాల్లో కమేడియన్స్ పొటోలన్నీ వున్నాయి..... జోకులూ....కార్టూన్లూ వున్నాయి.

"ఈ గదిలో పదినిముషాలు పగలబడి నవ్వాలి.. తర్వాత తలుపులు తీస్తాను" విశ్వపతి ఆర్డరు జారీ చేసి తలుపులు మూసి వెళ్ళిపోయాడు.

అందునా.... పగలబడి నవ్వమని చెప్పడం... నిజంగా నవ్వులాటగానే అనిపించింది. ఈ 'కౌన్సిలింగ్' ఆంతర్యం ఏవిటో ఎంతాలోచించినా అర్థం కాలేదు.

"మళ్ళీ ఇదేం ఖర్మండీ!"

"ఎవరు చేసిన ఖర్మ వారనుభవించక..... ఎవరికైనను తప్పదన్నా!" తత్వం గుర్తుకొచ్చి పాడాను. శాంతి తడి కళ్ళు మెరిశాయి. అంత బాధలోనూ సన్నగా నవ్వేసింది.

"నవ్వులు వినిపించడం లేదు. పగలబడి నవ్వాలి." బైట్నుంచి విశ్వపతి అరుపు.

"వీడికేవన్నా పిచ్చెక్కిందా... అక్కడ ఏడిపించాడు. ఇక్కడ నవ్వమంటాడేంటండీ... ఖర్మ... ఖర్మనీ!"

"దీన్నే లాఫింగ్ థెరపీ అంటారు శాంతీ!"

"నా శ్రాద్ధం... నా పిండాకూడు థెరపీ - నా బదులు మీరు నవ్వండి... నాకు ఓపిక లేదు బాబూ! శాంతి మొండికేసింది. అక్కడో బల్ల వుంటే దానిమీద చతికిలపడిపోయింది శాంతి.

నాకు నిజంగా నవ్వొచ్చి... పాతసిన్మా పాతాళభైరవిలో యస్వీ.రంగారావులా నవ్వాను. బలవంతంగా నవ్వడానికి శతకోటి ప్రయత్నాలు చేస్తున్నాను.

"నేను నవ్వమంటుంది అమ్మాయిని!" బైట్నుంచి విశ్వపతి డైరెక్షను.

"అమ్మాయా?... మళ్ళీ ఇదేం వరుసండీ..!"

"నవ్వకపోతే వొదిలేలా లేడు... ప్రాణాలు పోతేపోయాయ్. నవ్వకపోతే బలవంతంగా ప్రాణాలు తీసేలా వున్నాడు... ఎలాగో ఒకలా పదినిమిషాలు పిచ్చిపట్టినట్టు నవ్వేసేయ్.... కాదు నవ్వేద్దాం ! అన్నాను ఆందోళనగా.. శాంతి మెంటల్‌గా ప్రిపేరయిపోయింది.

పదినిముషాలు పిచ్చి పట్టినట్టు వీరనవ్వు నవ్వాం.

పేగులు తెగిపోతాయేమోనని భయమేసింది.

పదినిముషాలయింది. తలుపులు తెరుచుకున్నాయి.

టూత్‌పేస్ట్ ఎడ్వర్టయిజ్‌మెంట్‌లా పళ్లన్నీ బైటపెట్టి నవ్వుతూ కనిపించాడు విశ్వపతి. ఆ వెర్రినవ్వు చూసేసరికి గంగ వెర్రులెత్తింది శాంతి. బైటపడొద్దు అంటూ సైగలు చేశాను.

"కాఫీ తీసుకోండి!" ఇక్ష్వాకుల కాలంనాటి బెల్లు నొక్కాడు. రెండు కాఫీలు చెప్పేడు. కాఫీలు వచ్చాయి. ఉగ్గుగిన్నెడు కాఫీ అది.. గుటుక్కుమనిపించింది మా ఆవిడ. నేనూ కానిచ్చాను.

"మీరు ఓ పదినిముషాలు బైటికి వెళతారా ?" నన్ను చూస్తూ ఆజ్ఞాపించాడు విశ్వపతి.

"ప..ర..వాలేదు... మీరు చెప్పండి" శాంతిని చూస్తూ అన్నాను.

"మీరు వుండకూడదండీ.... కౌన్సిలింగంటే అదేమరి " దబాయించాడు. మా ఆవిడ విశ్వపతిని అనుమానంగా చూసింది. బీపీ రెయిజయిన ఛాయలు కనిపించాయి.

"అసలు...అసలు ఇపుడు ఏం చేయబోతున్నారో చెప్పండీ!" సీరియస్‌గా అడిగింది. "ముందు మీ వారు వెళ్ళనీ!"..... అతగాడు నాకేసే చూస్తున్నాడు.

నేను ఒక్క క్షణం ఆగి... సెల్ తీసుకొని... విసురుగా బైటికి నడిచాను.

తలుపులు మూసుకున్నాయి.... గొళ్ళెం పెట్టిన చప్పుడు.

నాలో కంగారు మొదలయింది... అతగాడు కౌన్సిలింగ్ పేరుతో ఏం పిచ్చి ప్రశ్నలు వేస్తాడో.. ఈవిడగారేం తలతిక్క సమాధానాలిస్తుందో... తెల్లారి లేచి ఎవరి మొహం చూసుంటానూ? ఇంకెవరి మొహం చూసుంటానూ?.... శాంతి మొహమే... శాంతి నా మొహం చూసుకుంటుంది.. అదీ సంగతి!

పదినిముషాలు గడిచాయి

తలుపులు తెరుచుకున్నాయి

మా ఆవిడ ముఖంలో ఏదో గిల్టీ కాంప్లెక్స్..

"అసలేం జరిగిందంటే?

"అంతా విన్నాను!"

"విన్నారా?... ఎలా?"

"నేను రూమ్‌లోంచి వచ్చేముందు.... నీ సెల్‌లో నా నెంబరు డయల్‌చేసి వచ్చాను... అది మీరు గమనించలేదు... అక్షరం పొల్లు పోకుండా అన్ని మాటలూ విన్నాను" అన్నాను. మాఆవిడ ఎగిరి గంతేసినంత పంజేసింది - నా తెలివితేటల్ని మా ఆవిడ జీవితంలో మొట్టమొదటిసారిగా మెచ్చుకుంది. నా ఆనందం అట్టేసేపు నిలవలేదు... ఎందుకంటే!...

"మీరు లంచ్ చేసి... కాస్సేపు మా గెస్ట్‌రూమ్‌లో రెస్ట్ తీసుకోండి!" విశ్వపతి తన శ్రీమతి "తులసి"ని పరిచయం చేస్తూ చెప్పేడు.

"మళ్ళా రెస్ట్ అంటాడేవిటండీ!"

"సాయంత్రం మూడోడోసు కౌన్సిలింగుందేమో!"

"వద్దునాయనోయ్... తిండీ తిప్పల్లేకపోయినా పరవాలేదు... పారిపోదాం రండి!" సన్నగా నా చెవిలో గొణిగింది తొందరపెడుతూ..

"ఇదే మీరెస్ట్‌రూమ్...రండి!" తులసి ప్రేమగా ఆహ్వానించింది.

"సాయంత్రం కూడా కౌన్సిలింగుంటుందా?" భయం భయంగా అడిగింది శాంతి.

"అసలు కౌన్సలింగ్ మొదలయ్యేదే సాయంత్రం!.. రండి లంచ్ చేద్దురు గాని..." తులసి మమ్మల్ని బలవంతంగా ఓపాదుపడిన గదిలోకి

తీసుకెళ్ళింది.

"కడుపులో దేవుతున్నట్టుందండీ... ఇంటికెళ్ళిపోతాం... మమ్మల్నొదిలెయ్యండి!"

"కుదరదు... రూల్సొప్పుకోవు... మీరు వుండాల్సిందే!"

"ఈ రూల్సు మనం పెట్టుకున్నవే కదండీ... కాస్త వెసులుబాటు కల్పించండి!" నా రిక్వెస్ట్.

"కుదర్దని చెప్తున్నానా?... ఆయనసలే తిక్కమనిషి!"

"ఆసంగతి వేరే చెప్పాలా!"

"మీరూరుకొండి...." నన్ను కసురుకుంది శాంతి. నా నోటికి తాళం పడింది.

"మా తరుపున మీరు రికమండ్ చేద్దురూ?" అభ్యర్ధనగా అడిగింది. అందుకామె భారంగా నిట్టూర్చి...

"అయ్యో పిచ్చితల్లీ.... ఆయన చండశాసనముండావాడు. తాను పట్టిన కుందేటికి అయిదారు కాళ్ళంటాడు... మనం భరించవలసిందే... ఒక ముద్దూ ముచ్చటా ఏదీ వుండదు. ఉదయం లేచింది మొదలు రాత్రి గుర్రుబెట్టేదాకా పని...పని....పని...డబ్బు....డబ్బు.... డబ్బు... జన్మానికో శివరాత్రిలా ఏ మేరేజ్‌డే నాడో ఇంట్లో వుండండి అంటే కౌన్సిలింగ్ మొదలుపెడతాడు... ఆ మాయదారి కౌన్సిలింగ్ భరించే బదులు... మూడంకె వేసి.... ముసుగుదన్ని పడుకోవడమే బెటరు. .... న...ర...కం... అనుభవిస్తున్నాను మీకేం తెలుసూ?... ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే ఆయన ఎవరి మాటా వినరు. మిమ్మల్ని పంపించానని తెలిస్తే నన్ను పుట్టింటికి పంపించేస్తాడు... అంత కర్కోటకుడు!" తులసి కళ్ళు కెంపులయ్యాయి.

"అంత మొండి మొగుడా?

"మామూలు మొండా? జగమొండి!" భర్త రావడం చూసి చటుక్కున జారుకుంది తులసి –

"ఏవంటోంది మా ఆవిడ?"

"ఏదో వంటా పెంటా మాట్లాడుకుంటున్నాం!" శాంతి సమాధానం చెప్పింది.

"దానికి వంట చేతగాదు. అదొౌటి పెంట! దాన్నోట్లో నోరు పెట్టకండి.. మీరు 'లంచ్' చెయ్యండి!" లంచ్ చూపించాడు విశ్వపతి.

"విశ్వపతిగారూ!" శాంతి గోముగా పిలిచింది

"మీరేం మాట్లాడొద్దు... లంచు... లంచూ!" అరిచాడు.. కాదు గాండ్రించాడు.

"విశ్వపతిగారూ!... దయచేసి నా మాట వినండి... నాకు బ్రత...కాలని..వుంది!" ఆమాట విని విశ్వపతితో బాటూ నేనూ అదిరిపడ్డాను. విశ్వపతి షాక్‌లోంచి తేరుకొని...

"అదేవిటీ... ఇందాక చచ్చిపోవాలనుందన్నావుగా!"

"అన్నాను... గానీ ఇపుడు....ఇపుడు బ్రతకాలనుంది!"

"యు మీన్? " అనుమానంగా చూశాడు విశ్వపతి.

"నిజం విశ్వపతిగారూ!... నాకు నిజంగా బ్రతకాలనుంది... ఒక వేళ చచ్చిపోతే... మావారి ఒడిలో సుమంగళిగా... పో...వా..లని వుంది!" శాంతి కళ్ళల్లో చిప్పిల్లిన కన్నీళ్ళు. శాంతి కళ్ళల్లో ఏదో వినూత్నమయిన వెలుతురు... తృప్తి... ప్రశాంతత... కొట్టొచ్చేలా కనిపించాయి.

"అమ్మాయ్ ! ఒక్కముక్కలో చెప్పు.. నా కౌన్సిలింగ్ బాగా పని చేసిందా? లేదా?"

"బ్రహ్మాండంగా పని చేసింది!"

"దటీజ్ విశ్వపతీ !... ఎవరికీ ఓవర్‌నైట్ పేరు ప్రఖ్యాతలు రావమ్మాయ్! నా సర్వీస్‌లో నీలాంటి వార్ని ఎంతమందిని..... ఎంతమందిని చూసుంటానూ?" దీర్ఘం తీస్తూ అన్నాడు విశ్వపతి.

"కానీ... కానీ...నా జీవితంలో మీలాంటి వార్ని... మిమ్మల్నొక్కర్నే చూస్తున్నాను !" అంది శాంతి – ఆ మాటలకి అర్థం నాకు తెలుసు – శాంతిని అమాంతంగా ఎత్తేసి... గిరిగిరా తిప్పేసి... ముద్దులతో తడిపేయాలనిపించింది. విశ్వపతి తన కౌన్సిలింగ్ సక్సెస్ అయినందుకు తెగ సంబరపడిపోయాడు.

విశ్వపతి గ్రీన్‌సిగ్నల్‌తో బైటికినడిచాం.

నరకంలోంచి స్వర్గంలోకి అడుగుపెడుతున్నట్లనిపించింది.


శాంతి నికేతన్ పబ్లిక్ స్కూల్

స్టేషన్ సెంటర్, కొండపల్లి - 521 228, ఫోన్ నెం : 2871854

2005 - 2006 విద్యా సంవత్సరంలో శాంతి నికేతన్ విద్యార్థుల అపూర్వ విజయం

విద్యార్థుల బంగారు భవిష్యత్ మా లక్ష్యం, అత్యుత్తమ విద్యాబోధన క్రమశిక్షణ మా గమ్యం



500 లు పైగా మార్కులు సంపాదించిన మా విద్యార్థులు

వి. ప్రవీణ్ కుమార్ (1305981) - 543/600,

ఎల్. ఇ. రాణి (1305980) - 530/600 జి.కార్తీక్ (1305400) - 505/600

పి. క్రాంతి కుమార్ (1305671) - 528/600 కె. అనిల్ కుమార్ (1305562) - 504/600



డైరెక్టర్స్ & కరస్పాండెంట్స్

యం. యేషయాబాబు 9866372691

పి. బాలచందర్ 9392971854